మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# జాతీయ సమైక్యతను చాటాలి

- ప్రతి ఇంటిపై బాధ్యతాయుతంగా జెండాను ఎగురవేయాలి
- హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఎంపి అరుణమ్మ ఇంటిపై ఎగిరిన మువ్వన్నెల జెండా
- ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ తమ ఇళ్లపై జెండా ఎగురవేయాలని పిలుపు



తన ఇంటిపై జెండాను ఏర్పాటు చేస్తున్న ఎంపి డికె అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 14 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణమ్మ 78వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మనకు స్వాతంత్ర్యం సిద్ధించి 77ఏళ్ళు పూర్తి కావస్తున్న సందర్భంగా బిజెపి కేంద్ర కమిటి పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం మహబూబ్‌నగర్‌లోని తమఇంటిపై జాతీయ జెండా ఎగురవేశారు.

**జాతీయ సమైక్యతను చాటాలి:** స్వాతంత్ర్యం సిద్ధించి మరో ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంగా బిజెపి కేంద్ర కార్యవర్గం పిలుపు మేరకు నేడు పంద్రాగస్టు సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి పౌరుడు తమ తమ ఇళ్లపై జాతీయ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పద్మజారెడ్డి, పి. శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్



జిల్లా వైద్య అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బి.యం సంతోష్

**గద్వాల ఆగస్టు 14, ప్రభాతవార్త:** సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆదేశించారు. బుధవారం గద్వాల్ కేంద్రం లోని ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు వైద్య సేవలు సమీక్షించారు. డయాగ్నొస్టిక్ సెంటర్, బ్లడ్ బ్యాంక్, మెడికల్ స్టోర్ట్ రూమ్‌ను పరిశీలించారు. డయాగ్నొస్టిక్ సెంటర్‌కు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి పంపిస్తున్న శాంపిల్స్, విష జ్వరాలు,డెంగ్యూ, మలేరియా కేసులపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతి రోజు ఎంత మంది రోగులు వస్తున్నారు, వారికి వైద్యం, వైద్య పరిక్షలు ఎలా అందిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. వైద్య సేవల కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలను పారదర్శకంగా అందించాలని అన్నారు. ప్రజలకు అన్ని రకాల మెడికల్, డయాగ్నోస్టిక్ టెస్టులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నయన్నారు. రాపిడ్ టెస్ట్ చేసే విధానాన్ని స్వయంగా పరిశీలించారు.సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచాలని అన్నారు. బ్లడ్ బ్యాంక్‌లో డెంగ్యూ రోగులకు ప్లేట్‌లెట్స్ ఎక్కించే ఎస్‌డీపీ (సింగిల్‌డోనర్ ప్లేట్‌లెట్) మిషన్‌ను పరిశీలించి, యాంత్రాన్ని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకునిరావాలన్నారు. అనంతరం ఫార్మసీ కేంద్రాన్ని పరిశీలించారు. మందుల స్టాక్ రిజిస్టర్ వివరాలను,అందుబాటులో ఉన్న అన్ని రకాల మందులు కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని, వీటిని ప్రజలు వినియోగించుకోవలని కలెక్టర్ సూచించారు. డీఎంహెచ్‌ఓ ఈ కార్యక్రమం యం.హెచ్.ఓ సిద్ధప్ప, హాస్పిటల్ సూపరింటెండెంట్ వినోద్, పాథలజిస్ట్ డాక్టర్ చైతన్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలు పెట్టుకొని అంకితభావంతో చదవాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- బోర్డుపై లెక్క వేసి గణితం బోధించిన జిల్లా కలెక్టర్



విద్యార్థులకు బహుమతిగా నోటు బుక్స్ అందిస్తున్న కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి ఆగష్టు 14 ప్రభాతవార్త:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని అంకిత భావంతో చదవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం ఉదయం చిట్యాల వద్ద పి.జి కళా శాలలో నిర్వహిస్తున్న జె.ఎన్.టి.యు అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలను, మర్రికుంటలోని కస్తూర్బాగాంధి బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఇంజనీరింగ్ కళాశాల తరగతి గదులు లైబ్రరీ, ఇతర సౌకర్యాలు పరిశీలించారు. ఇంజనీరింగ్ కళశాల తరగతి గదుల నిర్మాణ పనులు, వసతి గృహ టెండర్ ఆగిపోవడానికి గల కరణాలను కళాశాల ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసు కున్నారు. పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని, జిల్లా యంత్రాంగం తరుపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.



బోర్డు పై లెక్క వేసి బోధిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ఇంటర్మీడియట్ ఎంపీసీ విద్యార్థులకు గణితం బోధించిన జిల్లా కలెక్టర్:** కస్తూర్బా గాంధి బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. వసతుల ఎలా ఉన్నాయి? ఉపాధ్యాయులు సమయానికి వస్తున్నారా? భోజనం ఎలా ఉంటుంది మెనూ తెలుసా, గుడ్లు, మాంసం ఎప్పుడెప్పుడు పెడతారు తదితర విషయాలను విద్యార్థుల వద్ద కూపి లాగారు. వసతులు బాగున్నాయి, భోజనం సైతం బాగుంది అని విద్యార్థులు సమాధానం చెప్పారు. అనంతరం ఇంటర్మీడియట్ ఎంపీపీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బోర్డు పై లెక్క వేసి పరిష్కరించాల్సిందిగా కోరారు. ఒక అమ్మాయిసమస్యను పరిష్కరించడంతో కలెక్టర్ అభినందించారు.నోట్ పుస్తకాలు బహుకరించారు. అనంతరం కలెక్టర్ గణితంలో కొన్ని లెక్కలు సులువుగా ఎలా పరిష్కరించాలో బోధించారు. అనంతరం ఆహార సరకులు వాటి నాణ్యతను పరిశీలించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.వి.ఎస్ రాజు, జి.సి.డి.ఈ.ఓ శుభలక్ష్మి, కస్తూర్బా గాంధీ ఎస్.ఓ రోహిత, బి.సి సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డి, అధ్యాపకులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దు

- అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్



ప్రాథమికో ఆరోగ్య కేంద్రంలో పేషంట్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్

**నారాయణపేట టౌన్,ఆగష్టు 14 ప్రభాత వార్త:** విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. బుధవారం దామరగిద్ద ఎంపి డిఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి హామీ కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతూ ఉపాధి హామీ పనులలో అలసత్వం ప్రదర్శించరాదని పనులు ప్రణాళిక బద్ధంగా చేయాల న్నారు. మొక్కలు నాటడం నర్సరీల నిర్వహణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి వర్షపు నీటి సంరక్షణ కొరకు తీసుకుంటున్న చర్యలను గురించి పరిశీలించారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని ఎంపిడిఓ, ఎపిఓ, పంచాయతీ కార్యదర్శి, హెచ్‌ఎంలకు సూచించారు.అంతకు ముందు కలెక్టర్ దామరగిద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. డెంగ్యూ/వైరల్/మలేరియా లాంటి జ్వరాల కేసుల గురించి ఆరా తీశారు. జ్వర ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.అలాగే ఔషధాల లభ్యత,ర్యాపిడ్ టెస్టు కిట్‌లు, బ్లడ్ బ్యాంక్/ప్లేట్‌లెట్ కాంపోనెంట్ యాక్సెస్ ఇన్‌కేస్‌లవివరాలు అడిగితెలుసుకున్నారు.కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల పాల్గొన్నారు.

# మత్తు పదార్థల రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు కృషి చేయాలి

- గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రావు

**గద్వాల,ఆగష్టు 14 ప్రభాతవార్త:** మత్తు పదార్థల రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూఇంచార్జ్ టి. శ్రీనివాస్ రావు అధికారులకు ఆదేశించారు.బుధవారం ఐడిఓసిలోని తన ఛాంబర్ లో మాదక ద్రవ్యాల నిర్మూలన నార్కొటెక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం సంబంధిత అధికారులతో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో నిషేధించబడిన మత్తు పదార్థల సరఫరా లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రగ్స్ ను విక్రయించకుండా పూర్తి నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు జరుగకుండా అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. ప్రత్యేకంగా రైల్వే స్టేషన్, బస్ స్టేషన్లలో గట్టి నిఘా పెట్టాలన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మత్తు పదార్థలను ప్రజలు వినియోగించకుండా యువత మత్తు పదార్థలకు బానిసలు కాకుండా ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి యం.హృదయ రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు నాయక్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పర్వేజ్ అహ్మద్, డి.టి.ఎఫ్ ఇన్స్పెక్టర్ సాయిధి రెడ్డి, సెక్టోరల్ ఆఫీసర్ ఎస్తేరు, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.నరసింహాలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

- ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు14 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాంశాలలు, గురుకులాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం పౌష్టికాహారం అందించాలని, వంట గదుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ వంట నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. మైనార్టీ గురుకుల పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని, వంట గది పరిసరాలను, కూరగాయాలు, నిత్యవసర సరుకులు, నిల్వ ఉన్న బియ్యం నాణ్యతలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బియ్యంలో పురుగులు ఉంటే ఎలా శుభ్రం చేస్తారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ విద్యార్థులకు అందిస్తున్న భోజనం పట్ల నిర్లక్ష్యం చేయరాదని, నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు పరిశీలించి విద్యార్థులకు అందించాలని సూచించారు.పాఠశాలలో ఉన్న బియ్యం నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. బియ్యాన్ని పూర్తిగా పరిశీలించి వండుతున్నారా అని వంట ఏజేన్సీ నిర్వాహకులతో అడిగి తెలుసుకున్నారు. ఒక వేళ సరఫరా చేసిన బియ్యంలో పురుగులు ఉంటే ఉన్నబియ్యాన్ని తెప్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. వసతులు ఎలా ఉన్నాయి, అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఉన్నారా, భోజనం ఎలా ఉంటుంది మెను తెలుసా మీకు, గుడ్లు, మాసం ఎప్పుడెప్పుడు పెడతారు తదితర విషయాలను విద్యార్థుల వద్ద కూపి లాగారు. వసతులు బాగున్నాయి, భోజనం సైతం బాగుందని విద్యార్థులు సమాధానం చెప్పారు. 10వ తరగతిలో పదికి పది మార్కులు సాధించాలనే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, పాలెం ఆసుపత్రిని కలెక్టర్ పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ మలేరియా వంటి రోగాలతో వచ్చే ప్రజలకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారు, ఆసుపత్రిలో పూర్తి స్థాయి మందులు అందుబాటులో ఉన్నాయా అని కలెక్టర్ వైద్యులతో ఆరా తీశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను, మందుల నిలువ గది, రోగుల ఇన్‌పేషంట్ వార్డు, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వైద్యాధికారికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో కాన్పులు ఎక్కువగా జరిగేటట్లు చూడాలని, వర్షాకాలం సీజనల్ వ్యాధులు అధికంగా వ్యాపించే కాలం కాబట్టి వైద్యులు వైద్య సిబ్బంది ఎప్పుడు అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు.ప్రజలు రోగాల భారిన పడకుండా ముందస్తుగా వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.



మధ్యాహ్న భోజన సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



ఆసుపత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

# 77ఏళ్ల స్వాతంత్ర్యం

- రెండున్నర శతాబ్దాల బానిసత్వానికి తెర..
- తెల్లవారి గుండెల్లో గుబులు రేపిన సిపాయిల తిరుగుబాటు..
- బ్రిటిషర్ల కర్కశత్వానికి నిదర్శనం.. జలియన్‌వాలా బాగ్ దురంతం..
- క్విట్ ఇండియా ఉద్యమం.. భారత స్వాతంత్ర్యానికి అంకురం..
- 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవం నేడు



**భూత్పూర్,ఆగష్టు 14,ప్రభాతవార్త:** రెండున్నర శతాబ్దాల బానిసత్వం..ఎందరో అమాయకులు,స్వాతంత్ర్య సమర యోధుల ప్రాణ త్యాగాలు..సిపాయిల తిరుగుబాటు..జాతిపిత బాపూజీ నేతృత్వంలో సహాయ నిరాకరణ ఉద్యమం.. జలియన్‌వాలా బాగ్‌లో జనరల్ డయ్యర్‌చే అమాయక భారతీయుల ఊచకోత వెరసి 1942లో భారతీయుల క్విట్ ఇండియా తిరుగుబాటు బ్రిటిషర్ల గుండెల్లో గుబులు రేపి 1947లో స్వాతంత్ర్యం ఇచ్చేందుకు సిద్ధమైన బ్రిటిష రాణి ఎలిజబెత్. దేశ వ్యాప్తంగా నేడు 145 కోట్ల యావత్ భారత ప్రజలు 78వ స్వాతంత్ర్య సంబరాలు జరుపుతున్నారు. బ్రిటిషర్లు(ఆంగ్లేయులు)వర్తక వ్యాపారాల కోసం 1600వ శతాబ్దంలో భారతదేశంలో అడుగుపెట్టారు.ముఖ్యమైన నగరాలలో వ్యాపారాలు సాగించి భారత భూమిని హస్తగతం చేసుకుని అనతి కాలంలోనే పూర్తి భారతాన్ని తమ కంబంధ హస్తా ల్లోకి తీసుకుని దేశంపై అధికారం చెలాయించారు.భారతీయుల్ని బానిసలుగా చేసి పెత్తనం సాగించారు.దాదాపుగా రెండున్నర శతాబ్దాల పాటు భారతదేశాన్ని పాలించారు.భారతదేశాన్ని దాస్యశృంఖలాల నుంచి విముక్తిని చేసేందుకు పూజ్యబాపూజీ మహాత్మాగాంధీ,జవహర్‌లాల్ నెహ్రూ, బాలగంగాధర్‌తిలక్,సర్దార్ వల్లభభాయ్ పటేల్, లాలాలజపతి రాయ్, నేతాజి సుభాష్‌చంద్రబోస్,మోతీలాల్ నెహూ, బిపిన్ చంద్రపాల్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి ఎందరో మహాను భావులు,స్వాతంత్ర సమరయోధులు దేశం కోసం ప్రాణాలర్పిం చారు.1857లో మీరట్‌లో జరిగిన సిపాయిల తిరుగు బాటు,1920లో మహాత్మాగాంధీ, బాలగంగాధర్ తిలక్‌ల నేతృత్వంలో నిర్వహించిన హోం రూల్, సహాయ నిరాకరణోద్య మాలు,1930లో గాంధీ చేపట్టిన దండి సత్యాగ్రహం వంటివి భారత స్వాతంత్ర్యానికి అం కురార్పణ చేశాయి.1919లో బ్రిటిష్‌రాయబారి జనరల్ డయ్యర్ జలియన్‌వాలా బాగ్‌లో భారతీయులపై విచక్షణారాహిత్యంగా జరిపిన కాల్పులు దేశ చరిత్రలో భారతీయులు మరిచిపోలేనిది. మహాత్మాగాంధీ నేతృత్వంలో దేశనాయకులు 1942లో క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహించారు.దీంతో రాణి ఎలిజ బెత్ బ్రిటిష్ ప్రభుత్వం 1947 ఆగష్టు 14 అర్ధరాత్రి భారతదేశానికి స్వాతం త్ర్యం ప్రకటించగా యావత్ భారతావని స్వేచ్ఛా స్వాతంత్ర వాయువులు పీల్చుకున్నారు.ఆగష్టు 14న అర్ధరాత్రి తొలి ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ ఢిల్లీ ఎర్రకోటపై భారత జాతీయ జెండానెగుర వేశారు. మరుసటిరోజు తెల్లారే సరికి భారత ప్రజలు ఆనందోత్సవాల మధ్య మూడు రంగుల మువ్వన్నెల జెండాలనెగురవేస్తూ స్వాతంత్ర్యోత్సవాలు నిర్వహించారు.నాటి నుంచి నేటి వరకు ప్రతీ ఆగష్టు 15న ప్రతి కార్యాలయం,ప్రతి సంఘం,సంస్థ, ప్రతి విద్యాలయం, ప్రతి పౌరుడు తమ తమ ఆవరణల్లో జాతీయ జెండాను ఎగురవేసి తమ సంతోషంతో పాటు ఆనందాన్ని వ్యక్తం చేస్తాడు.జాతీయ గీతాన్ని ఆలపిస్తూ పరస్పరం స్వీట్లు పంచుతూ స్వాతంత్ర వేడుకలు నిర్వహిస్తారు.ఈ క్రమంలో జిల్లా కలెక్టరేట్,జిల్లా ఎస్పీ,ఆర్డీఓ కార్యాలయాలతో పాటు మండల కార్యాలయాలు, విద్యాసంస్థలు, కార్మిక సంఘాల కార్యాల యాలు,యువజన సంఘాల కార్యాలయాలు రంగు రంగుల విద్యుద్ దీపాలతో వెలిగే విధంగా సకల ఏర్పాట్లు చేసారు. పాఠశాలల విద్యార్థులు ఉదయాన్నే ప్రభాత్‌భేరి నిర్వహిస్తూ,ప్రభోధగీతాలతో ప్రజలకు స్వాతంత్ర దినాన్ని గుర్తు చేస్తారు. విద్యా సంస్థ లు, కార్యాలయాల ఎదుట మూడు రంగుల మువ్వన్నెల జెండాలనెగురవేసి తమ దేశభక్తిని చాటడమే కాకుండా విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తారు.

**కలర్‌ఫుల్‌గా కార్యాలయాలు.. విద్యాలయాలు:** స్వాతంత్ర్య దినోత్సవంగా సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వివిధ సంఘాల కార్యాలయాలు జాతీయ త్రివర్ణపతాకాలెగురవేసేందుకు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.ఈ సందర్భంగా త్రివర్ణ మామిడి తోరణాలు, విద్యుత్ కాంతులతో కన్నులు మిరుమిట్లుగొల్పే విధంగా తీర్చిదిద్దారు.జిల్లాలో నూతనంగా నిర్మించిన నూతన కలెక్టరేట్ భవనం,జిల్లా ఎస్పీ,ఆర్డీఓ కార్యాలయాలతో పాటు భూత్పూర్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్, తహసిల్, ఎంపిడీఓ,ఆసుపత్రి,పోలీస్,పోస్టాఫీస్,సింగిల్ విండో,ఎమ్మార్సీ కార్యాలయాలతో పాటు విద్యాలయాలు,వివిధ సంఘాల కార్యాలయాలు,పలు పార్టీల కార్యాలయాలు సర్వాంగ సుందరంగా అలంకరించారు.

# రంగసముద్రం నుండి సాగునీరు విడుదల

బీమా ఫేస్ టూ కాల్వకు రంగసముద్రం నుండి సాగునీరు విడుదల చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల ఆగష్టు 14 ప్రభాతవార్త :** రంగసముద్రం నుండి రైతులకు బీమా ఫేస్ టు కాల్వకు బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సాగునీటిని విడుదల చేశారు అవుట్ ఫర్ రెగ్యులేటర్ దగ్గర పూజలు నిర్వహించి టెంకాయ కొట్టి నీటిని విడుదల చేశారు. ఇవి పుల్గర్ జర్ల కల్వరాల వీపనగండ్ల మీదుగా సంపత్‌రావుపల్లి కొండూరు ఆయకట్టుకు సాగునీరు అందించడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన ఉండి సకాలంలో వర్షాలు కురవడం వల్ల కాలువలకు నీరు విడుదల చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వాటిని అధికారులు సరి చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే అంతకన్నా కొద్ది రోజుల ముందు కాలువలో మట్టి పూడికతీత జమ్ము గడ్డి పెరిగి చివరి ఆయకట్టుకు నీళ్లు పోకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్న రైతులకు ప్రోక్లిన్ పెట్టి పూడిక తీయడం జరిగిందని ఆయన తెలిపారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు అప్రమత్తతో కాలువలకు నీళ్లు వదలాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. అనంతరం పుల్గర్ జర్ల గ్రామంలో కొంతమంది టిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో చేరారు.ఈ సందర్భంగా మండలంలోని నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోదల బీరయ్య యాదవ్ రైతుబంధు మండల మాజీ అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య సమన్వయ సమితి అధ్యక్షుడు నారాయణరెడ్డి గంగిరెడ్డి మాజీ సర్పంచ్ వీపనగండ్ల కలిసి మండలంలో ఉన్న సమస్యలతో పాటుమండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయం ఏర్పాటు, వివిధ అంశాలపై ఆయనకు తెలియజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమా ఎస్సీ సత్యాశీలారెడ్డి,ఈ ఈ కేశవరావు,డి ఈ రాజకుమార్,ఏఈ కిరణ్ తో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక అధికారికల్వరాల నరసింహవెంకటేష్, పాము రాజశేఖర్, వెంకట్, రాజయ్యతోపాటువివిధగ్రామాలకార్యకర్తలునాయకులు పాల్గొన్నారు.



రైతులకు అభివాదం చేస్తున్న జూపల్లి



బీమా పేస్ 2 రెగ్యులేటర్ దగ్గర టెంకాయ కొట్టి సాగునీరు విడుదల చేస్తున్న మంత్రి

# విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- పాఠశాలను సదర్శించిన డీఈవో
- స్కూల్ మూసివేతకు ఆదేశాలు..?



గాయాలపాలైన చిన్నారి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 14, ప్రభాతవార్త:** ప్రేమగా విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థిని చితకబాదిన ఘటన జడ్చర్ల మండలం పోలపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశా లలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే..పోలెపల్లి గ్రామంలోని నవోదయ కాన్సెప్ట్ పాఠశాలలో అదే గ్రామానికి చెందిన జేశ్విత అను ఏడేండ్ల చిన్నారి ఒకటో తరగతి చదువుతున్నది. బుధవారం స్కూల్‌కి వచ్చిన జేశ్విత సక్రమంగా చదవడం లేదని, కర్రతో విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో వీపులో చర్మం కందిపోయింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరకొని కరస్పాండెంట్ రాందాస్‌ను నిలదీశారు. కోపంలో రాందాస్‌పై దాడి చేసేందుకు యంత్నించగా స్థానికులు అడుకడకోవడంతో ఘటనపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.విషయం తెలుసుకున్న డీఈవో రవీందర్ ఎంఈవో మంజులాదేవితో కలిసి పాఠశాలను సంద ర్శించారు. విద్యార్థిని చితకబాదింది వాస్తవమేనని, పాఠశాలను నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్నారని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నవోదయ పాఠశాలపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.పాఠశాల మూసివేతకు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తున్నది.జేశ్విత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రాందాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

# గొంతు నులిమి బాలుడి హత్య

12 గంటల్లో కేసును ఛేదించిన ఇటిక్యాల పోలీసులు



గొంతు నులిమి హత్యకు గురైన ఏడేళ్ల బాలుడు రఫి (ఫైల్)

**ఇటిక్యాల ఆగష్టు14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మునగాల గ్రామానికి చెందిన రఫీ 7 సంవత్సరాల వయసుగల బాలుడిని గొంతు నులిమి హత్య చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకోగా 12 గంటలలోపు ఇటిక్యాల పోలీసులు కేసును ఛేదించారు. పోలీసుల వివరాల మేరకు మునగాల గ్రామానికి చెందిన జమీర్ సమీరా బేగం మొదటి కుమారుడు రఫీ అనే బాలుడు మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయం నుండి కనిపించడం లేదని సమీరా బేగం మంగళవారం రాత్రి సమయంలో ఇటిక్యాల పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. వెంటనే కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా విచారణలో మౌలాలిపై అనుమానం వచ్చి అతడిని పోలీస్ స్టేషన్లో సిఐ రవిబాబు, ఎస్సై వెంకటేశ్, కోదండపురం ఎస్ఐ స్వాతి ఆధ్వర్యంలో విచారించగా అతడు అందించిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన ఖాసింసాబ్ మూడవ కూతురు అయిన మాలన్‌బీని వివాహం చేసుకున్నారని, మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారని అయితే నా సొంత బామ్మర్ది షేక్ జమీర్ భార్య షేక్ సమీరా బేగంతో గత కొంత కాలం నుండి అక్రమ సంబంధం కొనసాగుతుందని, ఈ సంబంధం కొనసాగు తున్న సమయంలో షేక్ సమీరా బేగంకు అవసరాల వారి కుటుంబ అవసరాల నిమిత్తం గత 6 నెలల క్రిత నా బామ్మర్ది షేక్ జమీర్‌కు 2 లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చానని ఆమె నా దగ్గర డబ్బులు తీసుకుని నాతో ఉండకుండా వేరే వాళ్ళతో అక్రమ సంబంధం కొనసాగిస్తుందని ఇట్టి విషయం నాకు గత రెండు నెలల క్రితం తెలిసిందని ఇదే విషయాన్ని సమీరా బేగంను ప్రశ్నించిందని ఇలా ప్రశ్నించడంతో నాకు కోపం వచ్చి ఆమెను ఏమి చేయలేక ఎలాగైనా వాళ్లని బాధపెట్టాలనే ఉద్దేశంతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నాబా మ్మర్ది షేక్ జమీర్ షేక్ సమీరా బేగం కుమారుడు అయిన రఫీ ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా నా బైక్‌పై రఫీ బాలుడిని ఎక్కించుకొని శివనంపల్లి గ్రామ సమాపంలోని కంది చేను పక్కన గల ముళ్ళపొదల్లోకి తీసుకెళ్లి గొంతును లిమి హత్య చేసినట్లు మౌలాలి ఒప్పుకోవడం జరిగిందని ఎస్ఐ వెంకటేష్ వివరించారు. నిందితుడు బాలుడిని గొంతు నిలిమి హత్య చేసినట్లు ఒప్పుకోగా డీఎస్పీ సత్య నారాయణ. అలంపూర్ సిఐ రవిబాబు. పలువురు ఎస్సైలు బాలుడు మృతదేహం వద్దకు చేరుకొని పరిశీలించారు. పోస్టు మార్టం నిమిత్తం బాలుడు మృతదేహాన్ని -మిగతా4లో..

## ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

● అదనపు కలెక్టర్ సీతారామారావు



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు

**ఉప్పునుంతల, ఆగష్టు 14 ప్రభాతవార్త:** పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదపు కలెక్టర్ సీతారామారావు సూచించారు. బుధవారం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రి, ఉప్పునుంతల 30 పడకల ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన సేవలు అందించాలని, వైద్య సేవల పట్ల ఆరా తీశారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు అధికంగా జరిగే విధంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న వసతులు, మందుల పట్ల తదితర అంశాలపై వైద్య సిబ్బంది ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్‌తో పాటు స్థానిక తహసిల్దార్ సునిత, ఫార్మసిస్టు కుమార ఆచారి ఉన్నారు.

## పెండింగ్ డిఏలను విడుదల చేయాలి

**ఉప్పునుంతల, ఆగష్టు 14 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేయాలని డిటిఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు జిక్కారామస్వామి అన్నారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలలను సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పదోన్నతులు కల్పించినట్లు ఆయన చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యారంగానికి 7శాతానికిపైగా బడ్జెట్‌ను కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడం హర్షణీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల విద్యారంగ సమస్యలపై తీసుకున్న నిర్ణయాలు శుభపరిణామం అన్నారు. అదేవిధంగా సకాలంలో పిఆర్‌సి ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రత్నప్రసాద్, జానకిరామ్, శంకర్ రాథోడ్, లక్ష్మీనారాయణ, కాకాని జ్యోతి, భార్గవి, వెంకటయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, ఆగష్టు 14 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు, కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ యువత శత్రువు అనే అంశపై వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాలొన్నారు. వారికి పోలీస్ స్టేషన్ వారిగా ఫస్ట్ సెకండ్ థర్డ్ విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని, స్టేట్ కాంపిటిషన్‌కు పంపించడం జర గుతుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. విద్యార్థులు నార్కోటిక్స్ డ్రగ్స్‌కుదూరంగా ఉండాలని వాటివల్ల విద్యార్థుల జీవితాలు నాశనం అవుతాయన్నారు. డ్రగ్స్‌కి బానిస అయితే నేరాలకు పాల్పడడం జరుగుతుందని సైకోలుగా మారి జీవితాలు నాశనం చేసుకోవడం జరుగుతుందని, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువకులు దూరంగా ఉండాలని తమ లక్ష్యంపై దృష్టి సారించాలని ఎస్పీ తెలిపారు. నారాయణపేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు తగు చర్యలు తీసుకోవడంతోపాటు జిల్లా పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం పోటీలు విద్యార్థులకు నిర్వహించడం జరుగుతుందని నారాయణపేట జిల్లా ప్రజలు, యువత పోలీసులకు సహకరించాలని ఎస్పీ తెలిపారు.

## బిజెపి ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ

**అమరచింత ఆగష్టు 14 ప్రభాతవార్త:** ప్రతి ఒక్క ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసుకోవాలని బీజెవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి, మెరువ రాజు, అమరచింత బిజెపి పట్టణ అధ్యక్షులు క్యామ భాస్కర్ ప్రజలను కోరారు. బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు హర్ ఘర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో బిజెపి కార్యకర్తలు నాయకులు ఇంటింటికి వెళ్లి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ప్రజలు తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసుకొని జాతీయ ప్రాముఖ్యతను చాటుకోవాలని వారు ప్రజలను కోరారు. భారతదేశ ప్రాధాన్యతను ప్రపంచ దేశాలకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చాటి చెప్పిన గొప్ప మహోన్నత వ్యక్తి అని వారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


## రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు గోపాల్ పేట విద్యార్థినీలు ఎంపిక



ఎంపికైన విద్యార్థినిలతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాకాంత్

**గోపాల్‌పేట ఆగష్టు 14 ప్రభాతవార్త:** ఈ నెల 16 వ తేదీ నుండి నిజామాబాద్ జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్ బాల్ పోటీలకు గోపాల్ పేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఏడుగురు విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన సెలక్షన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని, ఇందులో భాగంగా మాపాఠశాల నుండి ప్రణవి, మీనాక్షి, గీత, శిరీష, మాధవి, శైలజ, స్వరూప ఎంపిక కావడం జరిగిందని ఎంపికైనా క్రీడాకారులు వనపర్తి జిల్లా జట్టుకు ఆడడం జరుగుతుంది. ఎంపికైనా క్రీడాకారులను పాఠశాల ప్రదానోపాధ్యాయులు రమాకాంత్, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించడం జరిగింది. గోపాల్ పేట మండల కేంద్రం నుండి రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఒకేసారి ఏడుగురు విద్యార్థులు ఎంపికైనందున మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బంద్ సంపూర్ణం



గాంధీ చౌరస్తాలో హిందూ వాహిని సంస్థ సభ్యుల నిరసన

**ఆత్మకూర్ ఆగష్టు 14 ప్రభాతవార్త:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ వాహిని సంస్థల ఆధ్వర్యంలో చేపట్టినటువంటి ఆత్మకూర్ బంద్ బుధవారం రోజు సంపూర్ణంగా కొనసాగింది హిందూ వాహిని సంస్థలకు చెందిన పలువురు ప్రతినిధులు బుధవారం తెల్లవారుజామునుంచే పట్టణంలోని ప్రవీదలకుండా కలియ తిరుగుతూ హిందువులు ఐక్యంగా ఉండాలంటూ నినాదాలు చేస్తూ దుకాణాలను మూసి వేయించారు. ఒక రోజు ముందుగానే ప్రైవేట్ పాఠశాలలకు సమాచారం అందించడంతో బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ప్రైవేటు పాఠశాలలన్నీ కూడా తరగతులు బందు చేశారు. పట్టణంలోని ప్రవీదుల గుండా అన్ని పార్టీలకు సంబంధించిన హిందూ వాహిని సంస్థ సభ్యులు బంగ్లాదేశ్ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హిందువులపై ఇకనైనా దాడులను కట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆత్మకూర్ బందు కొనసాగించడం మూలంగా వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆత్మకూరు సిఐ మహేష్ కుమార్ ,ఎస్సై నరేందర్ తదితరులు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి బందు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అచలపక్ష పార్టీలకు చెందిన హిందూ వాహిని సంస్థల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**పెబ్బేర్ ఆగష్టు 14 ప్రభాతవార్త :** పెబ్బేర్ మున్సిపల్ కేంద్రంలో హిందువు వాహిని ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ లో జరుగుతున్న ఉగ్రవాదులు హిందువులపై చేస్తున్న దాడులకు నిరసనగా పెబ్బేర్ లో బంద్ నిర్వహించారు. ఈ బంద్ కు వాణిజ్య వ్యాపారస్తులందరూ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ జాగృతి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ ఊరేగింపు నిరసన తెలిపారు.



## పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

- జిల్లా ప్రజలకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు14 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలకు, మీడియాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీట్ల కేటాయింపుతో పాటు వేడుకలను తిలకించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెండా ఆవిష్కరణతో పాటు ముఖ్య అతిథి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించే ఏర్పాట్లను పరిశీలించి చర్చించారు. శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటుకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవానికి పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకలు, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించనున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు, అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉదయం నుంచే కలెక్టరేట్‌లో వేడుకలు ప్రారంభమవుతాయని, ఉదయం 9.45కు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆగమనము, 9.50కు జిల్లా కలెక్టర్ ఆగమనము, 9.55కు జి.చిన్నారెడ్డిలు ముఖ్యఅతిథులుగా విచ్చేసి10.00 గంటలకు జెండా విష్కరణ, 10.05కు పోలీసులగౌరవ వందనం, 10.15కు ముఖ్య అతిథి సందేశ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో అలాగే ప్రముకులు, వీఐపీలు, స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొంటారని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ ఆర్డీఓ, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

## పేదల హక్కులను కాలరాస్తున్న కేంద్ర సర్కార్

● సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల్ నర్సింహులు




సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

**బిజినేపల్లి, ఆగష్టు 14 ప్రభాతవార్త:** దేశ సమగ్ర అభివృద్ధిని వదిలి దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు కారు చౌకగా దోచి పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల్ నర్సింహులు విమర్శించారు. మండల కేంద్రంలోని ఎంజెఆర్ గార్డెన్స్‌లో బుధవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ విధ్వంసాన్ని కోరుకుంటున్నారని విమర్శించారు. దేశంలో స్థూల జాతీయోత్పత్తి పెరుగుదలను పేపర్‌లో చూపుతున్న పేదల బతుకుల్లో మార్పు లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గద్దెనెక్కిన మోదీ సర్కార్ కోటి ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేసిందని, రైతుల ఆదాయానికి గండి కొట్టిందని మొత్తానికి మోదీ పాలనలో మానవ హక్కులు ప్రమాదంలో పడ్డాయని విమర్శించారు. హెడెన్‌బర్గ్ ఆరోపణలపై తీవ్ర దుమారం రేపుతున్న నేపథ్యంలో ఛైర్మన్ మాధవిబచ్ రాజీనామా చేయాలని, ఆదాని గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటి వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడం లోపభూయిష్టమైన విధానాల కారణంగా హక్కులు, జీవనోపాదులు నిరాకరించడం అన్యాయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాల్లో తిరిగి ప్రజలు స్వాతంత్ర పోరాటం చేసే విధంగా ఉన్నాయన్నారు. ఢిల్లీలో జరిగిన మద్యం కుంభకోణంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలను విచారణ పేరుతో జైల్లో పెట్టిన కేంద్రం లక్షల కోట్ల అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఛైర్మన్ మాధవిబచ్‌పై సిట్‌తో విచారణ జరిపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు పరిపాలన కొనసాగించాలని రాష్ట్ర రైతాంగానికి రెండు లక్షల రుణ మాఫీ బ్యాంకు రుణఖాతాల ఆధారంగా రుణమాఫీ ప్రతి వ్యక్తికి చెందేలా చూడాలన్నారు. వలసల కరువు జిల్లాగా పేరున్న ఉమ్మడి జిల్లా ముఖ్యమంత్రి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు గతంలో చేసిన పనులకు బకాయిలు చెల్లించి నిధులు కేటాయించామని చెప్పడం సరైంది కాదన్నారు. కరువు జిల్లాలో కష్టాలు తెలిసిన వ్యక్తిగా కెఎల్ఐ నెట్టెంపాడు తదితర ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వ్యవసాయమే జీవనాధారంగా బతికే పాలమూరు రైతాగం కష్టాలు తీర్చాలని కోరారు. రాష్ట్రంలో ఉపాధి హామీ, మధ్యాహ్న భోజనం పేదలకు రావాల్సిన డబ్బులు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని కోరారు. పేదలకు పక్కా ఇల్లు నిర్మించాలని కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అడుగులు వేసేలా పాలమూరు జిల్లా ముఖ్యమంత్రితో చర్చలు చేస్తామన్నారు. మండల కార్యదర్శి పులిదండ కృష్ణాజీ అధ్యక్షతన జరిగిన సిపిఐ పార్టీ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, సిపిఐ కౌన్సిల్ సభ్యులు మంగపేట శ్రీనివాసులు, ఏఐటియుసి నాయకుడు చిన్నపాగ శ్రీను, మండల నాయకులు దానబాబు, నారాయణ, రాములు, మల్లయ్య, సాయిలు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



తిప్పడంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ ఆగష్టు 14 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని తిప్పడంపల్లి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం రోజు జిల్లా అదనపు కలెక్టర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాల సీజన్లో అంటూ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రోగులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్య సేవలు అందించాలని సూచించారు తిప్పడంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రసవాల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గర్భిణీలు ప్రసవించేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అంతేకాకుండా ఆరోగ్య కేంద్రానికి అవసరమైన మందులను సరఫరా చేసే విషయంలో ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సంప్రదించి మందులు అందుబాటులో ఉండే విధంగా ఈ విషయంలో రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండాలని ఆయన సూచించారు. ఆత్మకూర్ ఎంపీడీఓ సుజాత, ఏపీఎం శ్రీరామ్ రెడ్డి ,ఆరోగ్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్‌ను తిప్పడంపల్లి ఆరోగ్య వైద్య సిబ్బంది ప్రత్యేకంగా సన్మానించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

**పెబ్బేరు ఆగష్టు 14 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర బిల్డింగ్ ను పరిశీలించారు. అలాగే సీజనల్ వ్యాధుల గురించి అక్కడ ఉన్న వైద్య సిబ్బందిని అడిగారు, ప్రతి రోజు జ్వరము సర్వే చేయ్యాలని వైద్య సిబ్బందికి చెప్పారు. ఇట్టి కార్యక్రమంలో పల్లెదవాఖాన డాక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ అదిశేషు, హెల్త్ అసిస్టేంట్ రాజశేఖర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్, స్టాఫ్ నర్సులు విజయలక్ష్మి, మహాలక్ష్మి, ఫార్మాసిస్ట్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవం



బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అరుణ

**గద్వాల, ఆగష్టు 14 ప్రభాతవార్త:** గద్వాల పట్టణంలోని 33వ వార్డు చింతల పేటలో బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవంలో మహబూబ్‌నగర్ ఎంపీడీకే అరుణ పాల్గొన్నారు. అర్చకులు, బీజేపీ శ్రేణులు- వీర ఆంజనేయస్వామి దేవాలయంలో అరుణ ప్రత్యేక పూజలు చేశారు. ఆ ఆంజనేయుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. వీరాంజనేయస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు. మహబూబ్‌నగర్ ఎంపీడీకే అరుణ గద్వాల పర్యటనలో భాగంగా బుధవారం చింతల్‌పేట వీర ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రజలందరిపై ఆ వీర ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. గద్వాల పట్టణంలోని చింతల్ పేట బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమానికి వచ్చిన ఎస్.పి డీకే అరుణ ముందుగా స్థానిక వీర ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సొంత ఇలాఖా నడిగడ్డ పర్యటనలో అరుణ కు అభినందనలు వెల్లువెత్తాయి. గద్వాల పర్యటనలో భాగంగా చింతల్‌పేట బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న అరుణను పలువురు బీజేపీ శ్రేణులు, అభిమానులు. ప్రజల షాలువాలతో సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. తమ అభిమాన నేతతో సెల్ఫీలు, ఫోటోలు దిగేందుకు పోటీ పడ్డారు.

## తపాల శాఖ పొదుపు, ఇన్సూరెన్స్ పథకాలను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్ సైదా నాయక్

**అయిజ ఆగష్టు 14 ప్రభాతవార్త:** తపాలా శాఖ ప్రవేశపెట్టిన పొదుపు, ఇన్సూరెన్స్ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తపాలా శాఖ సహాయ పర్యవేక్షకులు గద్వాల ఎల్ సైదా నాయక్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా బుధవారం మండల పరిధిలోని మేడికొండ గ్రామంలో పోస్ట్ మాస్టర్ చిన్న మబు షాబ్ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (డీసీడీపీ) నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపాలా శాఖ ద్వారా అందిం చబడే పొదుపు, ఇన్సూరెన్స్ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలకు మహిళా సమ్మన్ సేవింగ్ ఖాతాలు, బాలికలకు సుకన్య సమృద్ధి యోజన ఖతాలు, అన్ని వర్గాల ప్రజలకు తపాలా శాఖ ద్వారా అందించబడే పొదుపు పథకాలు అనగా ఎస్బి, ఆర్డిసుకన్య, పి.పీ.ఎఫ్, ఎం.ఐ.ఎస్, యస్.సి.యస్ టి.డి పొదుపు ఖతాలు, గ్రామీణ తపాల జీవిత భీమా పథకాలు, ఐపిపిబి బ్యాంకింగ్ గ్రూప్ యాక్సిడెంట్ (జి.ఎ.జి) భీమా పాలసీలు ద్వారా అందించబడే అన్ని సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలిపారు. తపాల శాఖ పథకాలను గ్రామ అభివృద్ధి ఎంతగానో ఉపయోగిపడుతాయని కావున గ్రామ ప్రజలందరూ తపాలా శాఖ సేవలు ఉపయోగించుకో వాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ సబ్ పోస్ట్ మాస్టర్ ఐజ యస్ ఓ, రవీందర్ డాక్ సేవక్ ఐజ యస్ ఓ ,జి సుధాకర్‌యం ఓగద్వాల్, దివాకర్ రెడ్డి, కార్యదర్శి మేడికొండ గ్రామం, ఐజ ఉప తపాల కార్యాలయ బీపీయం లు, ఏబీపీయం లు, తపాలా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో ఉట్టిపడిన దేశభక్తి

-ప్రతి ఇంటిపైన ఎగిరిన త్రివర్ణపతాకం

**దేవరకద్ర, ఆగష్టు 14 ప్రభాతవార్త:** దేవరకద్ర, కౌకుంట్ల మండలాలలో బుధవారం హర్ ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోది పిలుపుమేరకు హర్ ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. దీంతో ప్రతి గ్రామంలో దేశభక్తి ఉట్టిపడింది. దేవరకద్రలో బిజెపి దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రశాంత్‌రెడ్డి ఇంటి పైన ఆయన త్రివర్ణపతాకాన్ని ఎగుంవేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు, రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యుడు దేవన్నసాగర్, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, కొండ నాగిరెడ్డి, తిమ్మన్న, రాంబాబు, నరసింహ్మ, రాములు, కుమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు. దేవరకద్రలో నట్టలి కృష్ణయ్య అధ్వర్యంలో ప్రతి ఇంటికి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అలాగే కౌకుంట్ల మండలంలో కూడ ఈకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆగష్టు 15 స్వాతంత్రదినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోది పిలుపు మేరకు హర్ ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ఆయా గ్రామాలలో:** దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో సోమవారం కోట్ల విజయ్‌రెడ్డి అధ్వర్యంలో బుధవారం ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అలాగే పెద్దగోప్లాపూర్, చౌదర్‌పల్లి తదితర గ్రామాలలో కూడ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోది పిలుపుమేరకు హర్ ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు దేవరకద్రకు ఎమ్మెల్యే రాక

**దేవరకద్ర, ఆగస్టు14 ప్రభాతవార్త:** దేవరకద్రకు గురువారం ఎమ్మెల్యే జి.మదుసూధన్‌రెడ్డి వస్తున్నట్లు కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షుడు బూనేటి అంజిల్‌రెడ్డి తెతిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 7లకు 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని ఆయన తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంద సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయప కోరారు.

## గ్యాంగ్ మెస్‌కు అవార్డు ఇవ్వాల్సిందే...

కష్టపడి పని చేసే ఉద్యోగులకు గుర్తింపు దక్కేనా..

**మల్దకల్ ఆగష్టు 14 ప్రభాతవార్త:** ప్రతినిత్యం తన బాధ్యతగా విధి నిర్వహణలో విధులు నిర్వహిస్తూ మల్దకల్ నుండి ఐజ రోడ్డు ఆర్ అండ్ బి రోడ్డుకు మట్టి వేస్తూనే ఉంటాడు. ఇటువంటి గ్యాంగ్ మెన్ ఇప్పటివరకు చూడలేదు చూడలేదని ప్రయాణికులు అంటున్నారు. ప్రతిరోజు ఆర్ అండ్ బి రోడ్డుకు గుంతలు పడిన ఏదో ఒకచోట మట్టి వేస్తూ పలు వాహన చోదకులకు కనిపిస్తుంటాడు, జిల్లాలో ఎక్కడ కూడా గ్యాంగ్ మెన్ లు ఆర్ అండ్ బి రోడ్డు గుంతలకు మట్టి వేసిన దాఖలాలు లేవు. కానీ మల్దకల్ గ్రామానికి చెందిన గ్యాంగ్ తిమ్మప్ప తనవిధి నిర్వహణలో తమ జీతం తీసుకుంటున్నామని భావనతో వృత్తి ధర్మాన్ని పాటిస్తూ పనిచేస్తున్నారు. గ్యాంగ్ తిమ్మప్ప పలువురు ప్రశంసించారు. ఇటీవల సద్ద లోనిపల్లి సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డుకు మట్టి వేస్తుంటే గద్వాల వైపు వెళుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి వాహనాన్ని ఆపి గ్యాంగ్ తిమ్మప్పకు శాలువాతో సన్మానించి అభినందించారు. ఇటువంటి గ్యాంగ్ మెన్‌ను నేను నేనెప్పుడూ చూడలేదని ఆయనపై ప్రశంశాలుకురిపించారు. ఆగష్టు15వ తేదీన స్వాతంత్ర దినోత్సవం ఈరోజున ఆర్ అండ్ బి శాఖ అధికారులు స్పందించి వెంటనే జిల్లా కలెక్టర్‌కు సిఫారసులేఖలపంపించి అవార్డు ప్రశంస పత్రం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఐజ, గద్వాల వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

## ఉన్నత పాఠశాలకు మైక్ సెట్ వితరణ

**ఆత్మకూర్ ఆగష్టు14 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు 1981.82 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు మైక్ సెట్ ను విరాళంగా అందజేశారు. తాము చదువుకున్న పాఠశాలకు స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మైక్ సెట్ ను విరాళంగా అందించడం సంతోషంగా ఉందని పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఎంఈఓ ఇంచార్జి హెచ్ఎం కృష్ణతదితరులు పూర్వ విద్యార్థులు పాఠశాలకు మైక్ సెట్ వితరణ అందించడం మరి కొంతమందికి స్ఫూర్తి దాయకంగా నేరవేరుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎంఈఓ భాస్కర్ సింగ్ తో పాటుగా ఉపాధ్యాయులు సంతోష్ ఉపాధ్యాయ సిబ్బందితో పాటుగా పూర్వ విద్యార్థులు శివకుమార్, కుర్షీద్ దివాంజి ,అశోక్ కుమార్, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి అక్షితకు అండగా ఉప్పల ట్రస్ట్

**కల్వకుర్తిరూరల్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన 4 సంవత్సరాల చిన్నారి చిటికెల అక్షిత పుట్టకతో మూగ అమ్మాయి. అంగవైకల్యంతో బాధపడుతు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ప్రస్తుతం ఆసుపత్రి ఖర్చులకు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహాయాన్ని అందించారు. చిన్నారి అక్షితకు మెరుగైన వైద్య సేవలకై రూ.15వేల ఆర్థిక సహాయాన్ని ఉప్పల ట్రస్ట్ ద్వారా బుధవారం అందించారు. కార్యక్రమంలోనాయకులు తిరుమణి శ్రీశైలంగౌడ్, శేఖర్ యాదవ్, రమేష్, వెంకటయ్య, మల్లేష్, దారమోని గణేష్, నరేష్, రామకృష్ణ, శేఖర్‌గౌడ్, నాగరాజు, బుచ్చిబాబు ఉన్నారు.

## జిల్లాలో కొత్తగా రెండు గ్రామ పంచాయతీల ఏర్పాటు

**ఖిల్లాఘణపురం ఆగష్టు 14ప్రభాతవార్త:** మండలంలో నూతనంగా రెండు గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం గెజిట్ జారీ చేసినట్లు మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత డిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మండలంలో ముందరి తండా వసరాంతాలను కొత్తగా గ్రామ పంచాయతీల ఏర్పాటు కొరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని అప్పటి గవర్నర్ తమిళ్ సై వాటిని పెండింగ్లో పెట్టారని గత వారం రోజుల క్రితం రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి ని కలిసి కొత్త గ్రామ పంచాయతీల గురించి వివరించడం జరిగిందన్నారు. చిన్నారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయారని గతంలో అసెంబ్లీలో శాసనమండలీలో బిల్లు ఆమోదించారని రాష్ట్ర వ్యాప్తంగా 20023 గ్రామపంచాయతీలు ఏర్పాటుకు ఆమోదించాలని ముఖ్యమంత్రి చొరవ తీసుకొని గెజిట్ విడుదల చేయించారని కొత్తవి గ్రామ పంచాయతీల ఏర్పాటుకు కృషిచేసిన చిన్నారెడ్డి కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కి గిరిజనుల తరుపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని మాజీ ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

• ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలి • వీసీలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

**వనపర్తి ప్రతినిధి ఆగష్టు 14 (ప్రభాతవార్త):** ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండటానికి పారిశుధ్యంతో పాటు జ్వరాల సర్వే పకడ్బందీగా జరగాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జ్వరాలతో వస్తున్న రోగుల అవాసాలతో పాటు గ్రామం మొత్తంగా పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జ్వరం రక్త పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ పంచాయతీరాజ్, వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేసే కార్మికులకు రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి లక్షణాలతో విధులకు వెళితే విద్యార్థులు అందరికీ జ్వరాలు సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులు తినే ముందు చేతులు శుభ్రంగా కడుక్కొనే విధంగా చూడాలన్నారు. బుధవారం మధ్యాహ్నం సీజనల్ వ్యాధులు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం పై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, విద్యా, వైద్య, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులకు నిర్దుష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రి లో కానీ, ప్రైవేట్ ఆసుపత్రిలో కానీ డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ కేసులు గుర్తిస్తే వెంటనే సంబంధిత రోగి ఇంటి చిరునామా తెలుసుకొని పరిసర ప్రాంతాల్లో జ్వర సర్వే నిర్వహించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ప్రతి గురువారం పాఠశాలలు, వసతి గృహాలను విధిగా సందర్శించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆహార సామాగ్రిని పరిశీలించాలని, నాణ్యతో పాటు ఎక్స్పైరీ తేదీ అయిపోయినవి ఉంటే వెంటనే తిరిగి పంపించాలని ఆదేశించారు. దోమలు ప్రబలకుండా డ్రైడే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కేసుల వివరాలు తెలుసుకొని చర్యలు తీసుకునేందుకు పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ అధికారులతో ఒక వాట్సాప్ గ్రూప్ పెట్టాలని సూచించారు. అవసరమైన చోట హెల్త్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్, జిల్లా అధికారులు, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

## కార్మిక వ్యతిరేక మోడీ

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగష్టు 14 ప్రభాతవార్త:** సిఐటియు మహా బూబ్‌నగర్ జిల్లా కార్యాలయంలో ఆల్‌ట్రేడ్ యూనియన్ల సంయుక్త కిసాన్ మోర్చా జాయింట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, సిఐటి యు రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని, ఎనిమిది గంటల పనిని 12,14 గంటలకు పెంచి బిజెపి పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తుం దని, కార్మికులకు కనీస వేతనాలు అమలు పరచకుండా, రోజుకు రూ. 178 నిర్ణయించడాన్ని తీవ్రంగా వారు ఖండించారు. దీన్ని నిరసి స్తూ దేశవ్యాప్తంగా 14వ తేదీ రోజు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కార్మికవర్గం నిరసనలు చేపట్టిందని తెలిపారు. ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు వి.రాములు యాదవ్, సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి కడియాల మోహన్‌లు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం సాధించుకున్న కార్మిక హక్కులను, సంఘం పెట్టుకునే హక్కును, పోరాడే హక్కును నేడు బిజెపి ప్రభుత్వం కాలరా స్తుందని దీనికి వ్యతిరేకంగా ఆల్‌ట్రేడ్ యూనియన్లు సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహి స్తుందని వారు తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక రాజ్యాంగ హక్కులన్నింటిని బిజెపి క్రమంగా తొలగిస్తున్నదని, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యపరిచిందన్నారు. కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్‌లుగా తెచ్చిందని, 73 షెడ్యూల్ పరిశ్రమల జిఓలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికులందరికి కనీస వేతనం రూ. 26 వేలు అమలు పరచాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్,వంటగ్యాస్‌పై కేంద్ర ఎక్సైజ్ కాని తక్షణమే ఎత్తివేయాలని, ప్రజా పంపిణీ విస్తృతపరిచి 14రకాల నిత్యావసర సరుకులను ప్రజలకు అందించాలని డిమాండ్ చేస్త గతవారం రోజుల నుంచి ఈ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు వారు తెలిపారు. ఇందులో ఐఎన్‌టియుసి నాయకులు ఎం.విజయబాబు, శ్రీనివాసులు, సిఐటియు నాయ కులు రాజ్‌కుమార్, చంద్రకాంత్, జహంగీర్ పాల్గొన్నారు.

## 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథిగా జితేందర్‌రెడ్డి



జోగులాంబ జిల్లా ప్రత్యేక అతిథిగా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి జితేందర్ రెడ్డి

**గద్వాల, ఆగష్టు 14 ప్రభాతవార్త:** 78వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథిగా, రాష్ట్ర ప్రభుత్వం మాజీ ఎంపీ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వం సలహాదారు జితేందర్ రెడ్డిని నియమిస్తూ బుధవారం ఉత్తుర్యులు జారీ చేసింది.15న గురువారం పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 10.05 గంటలకు జరిగే జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రత్యేక అతిథి జితేందర్‌రెడ్డి పాల్గొని జెండావిష్కరణ చేస్తారని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌చే ఉదయం 9:30 గంటలకు, అలాగే ఉదయం 10:00 గంటలకు స్థానిక పోలీస్ పరేడ్ మైదానంఆవరణలో ఎ.పి జితేందర్‌రెడ్డి, ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు క్రీడావ్యవహారాలుచే పతాకా విష్కరణ కార్యక్రమం నిర్వహించబడును. అదేవిధంగా సంకృతిక కార్యక్రమంలో, స్టాల్స్‌ను జితేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్,జిల్లా ఎమ్మెల్యేలు,ఇతర ప్రముఖులు పరిశీలన చేస్తారు.

## పట్టాలు పొందిన లబ్ధిదారులకు న్యాయం చేశాం

**వనపర్తి టౌన్ ఆగష్టు 14 ప్రభాతవార్త:** పట్టణంలోని నాగవరం శివారులో గల సర్వేనెంబర్ 248 లో గల భూమిలో గతంలో పట్టాలు పొందిన లబ్ధిదారులకు న్యాయం చేశామని వెంచర్ వేసిన వ్యాపారులు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 248 లోని 12 ఎకరాల భూమిని ఎనిమిది మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులం కలిసి కర్రే కిష్టన్న ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. అట్టి భూమి 1997 లో తమ పేరుపై రిజిస్ట్రేషన్ అయిందని, వెంచర్ వేసిన భూమిలో వాయిదాల పద్ధతిలో స్కీములో పేరు నమోదు చేసుకున్న 52 మందికి ప్లాట్లు కూడా రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందన్నారు. కర్రీ కిష్టన్న మరణించిన అనంతరం 2010 లో అతని కూతురు నాగమ్మ వచ్చి వెంచర్ లో పాతిన రాళ్లను తొలగించి దౌర్జన్యానికి పాల్పడడం ఇదే భూమిని మరోసారి ఇతరులకు విక్రయించడంతో హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. దీంతో హైకోర్టు కూడా నాగమ్మ పెట్టిన కేసును డిస్మిస్ చేసిందని తెలిపారు. గతంలో ఉన్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఇట్టి భూమిపై సర్వహక్కులు తమకే ఉన్నాయని అనుమతి కూడా ఇవ్వడం జరిగిందని, కష్టపడి కాయ కష్టం చేసుకుని పైసా పైసా కూడబెట్టి, వెంచర్లో వాయిదాల పద్ధతిలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులకు న్యాయం చేయడం వ్యాపారులుగా తమ కనీస ధర్మం అని తెలిపారు. ఇట్టి స్థలంలో మళ్లీ రాళ్లు పాతి లబ్ధిదారులకు పాట్లుఅప్పగించడం జరిగిందని, ఇలాంటి దౌర్జన్య సంఘటనలు మరోసారి జరగకుండా ఉండాలని, నిజమైన లబ్ధిదారులకు అన్యాయం ఎక్కడ జరగకూడదని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కూచుకుల రవీందర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, శివ రాజా, వెంకటసుబ్బమ్మ, జానమ్మ,రాములు , ఈశ్వర్, రవి ప్రకాష్, సుబ్బారెడ్డి, యాదగిరి, కరీం తదితరులు పాల్గొన్నారు.

## రాములమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి



**పెద్దమందడి ఆగష్టు14, ప్రభాతవార్త:** పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సి.పెంటన్న యాదవ్ చెల్లెలు దేశి రాములమ్మ దశదిన కర్మకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యాక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై రాములమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుందని మనోధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. చిన్నారెడ్డి వెంట నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి. పెంటన్న యాదవ్, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు ఐ.సత్యారెడ్డి, భాస్కర్, జగత్ పల్లి ఉసేన్, కురుమన్న, మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

• కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగన్న, చైర్మన్ ప్రశాంత్

**కొత్తకోట ఆగష్టు 14 ప్రభాతవార్త:** అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టిన మాజీ జడ్పీటీసీ కృష్ణయ్య పై చర్యలు తీసుకోని ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేయాలనీ మదనాపురం మండల అధ్యక్షులు నాగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ అన్నారు. బుధవారం మదనాపూర్ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అజ్జకొల్లు గ్రామానికి చెందిన కృష్ణయ్య గత 30 సంవత్సరాల కిందట తనకున్న 9 ఎకరాల 34 గుంటల భూమిని గ్రామానికి చెందిన కొందరికి నివాస యోగ్యం కోసం అమ్మడం జరిగిందని తెలిపారు. అయితే అమ్మిన భూమిన లబ్ధిదారుల పేరుమీద మార్చకుండా అధికారులను తప్పుద్రోవ పట్టించి వారి పేరుమీద ఉండే విధంగా పాసుబుక్ లు పుట్టించుకొని రైతు బందు డబ్బులు స్వాహా చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అంతేకాక అదే భూమి పేరు మీద బ్యాంకులో రుణాలు తీసుకున్నారని చెప్పారు. సుమారుగా ఇప్పటికి ప్రభుత్వ డబ్బులు 10 లక్షల వరకు స్వాహా చేసినట్లు ఆరోపించారు. వాటన్నింటిపై చర్యలు తీసుకోని ప్రభుత్వ నగదును రికవరీ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అజ్జకొలు మాజీ సర్పంచ్ సత్యం, వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, రాజిరెడ్డి, గొల్ల శీను, మరి శేఖర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మహాదేవ గౌడ్, మణి వర్ధన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జగదీష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు వాహనాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



పోలీసు వారి వాహనాలను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి ప్రతినిధి ఆగష్టు14 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పరిధిలోని పోలీసు వాహనాల పనితీరు వాటి నిర్వహణను వనపర్తి జిల్లా ఎస్.రావుల గిరిధర్, ఐపీఎస్ జిల్లా ఏఆర్ హెడ్ క్వార్టర్స్ (ఎంటి సెక్షన్)లో పరిశీలించారు. వాహనాల పనితీరు, నిర్వహణపై రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌లు నివేదిక ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...వనపర్తి జిల్లా పరిధిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో గల పోలీస్ వాహనాలు నిరంతరంగా వివిధ ప్రజాసేవలకు, ఎలాంటి ఆటంకం కలగకుండా సాఫీగా ప్రజా సేవలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. వాహనాల నిర్వహణ లోటు పాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి సమగ్ర నివేదికను నెలవారీగా సమర్పించాలని మోటార్ వాహనాల అధికారి కి తెలియజేశారు. వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంచి కండిషన్లో ఉంచుకోవాలని వాహన డ్రైవర్లకు ఆదేశించారు. పోలీసు అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సొంత వాహనంలా మంచి కండిషన్లో ఉంచి ఎప్పటికప్పుడు సర్వీసింగ్, ఇంజన్ ఆయిల్, టైర్ల నిర్వహణ ఉత్తమ ప్రమాణాలను పాటించుకుంటూ డ్రైవర్లకు నిర్వహణ ఉత్తమ ప్రమాణాలను పాటించుకుంటూ డ్రైవర్లకు నిర్వహణపై ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించాలని తెలియజేశారు, అదేవిధంగా ఎంటి ఆఫీసులో డ్రైవర్ల విశ్రాంతి గది నందు గల క్యారం బోర్డు డ్రైవర్లతో, అధికారులతో కాసేపు సరదాగా ఆడారు, ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీ రామదాసు తేజావత్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, అప్పలనాయుడు, ఆర్ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నందిపేట గ్రామానికి బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

**మూసాపేట,ఆగష్టు 14 ప్రభాతవార్త:** మండలంలోని నందిపేట గ్రామానికి నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి బస్సును ప్రారంభించి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారు. అనంతరం దాసన్‌పల్లి గ్రామంలో పర్యటించారు. దాసర్‌పల్లి గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. గ్రామ స్థానిక నాయకులు కలసి గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. వేముల గ్రామంలో ఐమాక్స్ లైట్లను ప్రారంభించారుఈ సందర్భంగా గ్రామ వాసి ఎమ్మెల్యేకు ఫొటో బహూకరించారు. మూసాపేట రైతు వేదిక ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని రైతుభీమా, కళ్యాణలక్ష్మి చెక్కులనులబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్



కళ్యాణలక్ష్మి, రైతుబీమా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

సంకలమద్ది గ్రామానికి చేరుకుని కొత్త గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ బ్రహ్మంగౌడ్, మండల అధికారులు మండల విద్యాధికారి రాజేశ్వర్‌రెడ్డి, దాసర్‌పల్లి ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, మాజీ జడ్పీటిసి బాల్ నరసింహులు,మూసాపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టిశేఖర్, మాజీ ఎంపిపిరామన్‌గౌడ్, వేములమాజీ ఎంపిటిసి యాట సత్యానారాయణ, సుధాకర్, మండలకాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు లక్ష్మీకాంత్‌రెడ్డి, రవిదాసర్‌పల్లి మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, రేవతి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలి

### సంస్కార భారతి సభ్యులు గోనెల రాధాకృష్ణ

**రాజాపూర్,ఆగష్టు 14 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రంలోని రంగారెడ్డిగూడలో బుధవారం స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, దేశభక్తి గేయాలు, పాటల పోటీలు, ఉపన్యాసాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కార భారతి సభ్యులు గోనెల రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యార్థిని పట్టుదల కృషి కార్యాచరణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారు. విద్యార్థుల్లోని దేశభక్తిని పెంపొందించేందుకు సంస్కార భారతి కృషి చేస్తుంది. చిన్న వయసు నుండి విద్యార్థులు మన సంస్కృతి సంప్రదాయాలు సంస్కారంతోపాటు కళా రంగంలో వివిధ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభ నిరూపించుకున్న వారికి బహుమతి ప్రశంసా పత్రాలు సంస్కార భారతీయ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, నాగయ్య, మంజుల, జానకి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న రాధాకృష్ణ

## మన్యంకొండలో కొనసాగుతున్న శ్రావణమాస విశేషోత్సవ పూజలు

**దేవరకద్ర,ఆగష్టు 14 ప్రభాతవార్త:** మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం విశేషోత్సవం పూజలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దీంతో జిల్లా నలు మూలల నుండి భక్తులు స్వామి వారి దర్శనానికి అధికసంఖ్యలో తరలివస్తున్నారు.ఈ నెల 5 నుండి మన్యంకొండలో శ్రావణమహోత్సవ పూజలు ప్రారంభం అయ్యాయి.ప్రతి ఏడాది దేవస్థానంలో శావణమహోత్సవ పూజలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు.అందులో భాగంగానే ఈ ఏడాది కూడ దేవస్థానంలో శ్రావణమాసం పూజలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వచ్చే నెల సెప్టెంబరు 8వరకు స్వామివారి సన్నిధిలో ఈ విశేషోత్సవాలు జరుగనున్నాయి.దేవస్థానంలో శ్రావణమాసం పూజలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా దేవస్థానంలో ఉదయం శ్రీ లక్ష్మీసహస్రనామార్చనపూజ,మద్యాహ్నం విష్ణుసహస్రనామార్చన,హనుమద్దాసుల వారి భజన పారాయణం,శాంతి హోమం,సాయంత్రం శ్రీ వెంకటేశ్వరసహస్రనామార్చన,శ్రీ రామ సహస్రనామార్చన,భజన తదితర పూజాకార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.జిల్లానుండేగాక ఇతర రాష్ట్రాలనుండి భక్తులు మన్యంకొండకు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకోంటున్నారు. కొంతమంది తలనీలాలు సమర్పిస్తున్నారు.దీంతో దేవస్థానం ప్రాంతం ప్రతి రోజు భక్తులతో కిటకిటలాడుతుంది.విశేషమాసం సందర్భంగా మన్యంకొండలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహిస్తున్నారు.స్వామి వారిని రకరకాల పూలు, వివిధ బంగారు ఆహరణాలతో సార్వాంగ సుందరంగా అలంకించి ఈ పూజలు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మాయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి,శ్రీకాంత్ తదితరులు పాల్గొంటున్నారు.



శ్రీదేవిభూదేవి సమేతంగా శ్రీవెంకటేశ్వర స్వామివారు

## నూతన అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న అధికారులు

**జడ్చర్లఆగష్టు 14 ప్రభాతవార్త :** జడ్చర్ల నూతన అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి అధికారులు బుధవారం భూమిపూజ చేసినట్లు అగ్నిమాపక కేంద్రం అధికారి పి.రాజేందర్ తెలిపారు. హెట్రో కంపెనీ వారి సౌజన్యంతో కార్యక్రమం ఏర్పాటు చేయగా అనంతరం అధికారులను, నిర్వాహకులనుసన్మానించారు.కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డిఎఫ్ఓ పి.కిశోర్, ప్లాంట్‌హెడ్ రామకృష్ణ (హెట్రో ఫార్మా పోలేపల్లి సెజ్) రవి కిరణ్, కావేరమ్మపేట మాజీ సర్పంచ్ బుక్కా వెంకటేశం, మల్లికార్జున్, ఎస్ఎఫ్ఓ మహబూబ్‌నగర్ జి. రాఘవేందర్, లీడింగ్ ఫైర్‌మెన్ జడ్చర్ల లక్ష్మీకాంత్‌రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది హెటిరో కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

## విస్తృతంగా ఎక్సైజ్ అధికారుల దాడులు

**కల్వకుర్తి, ఆగష్టు 14 ప్రభాత వార్త:** కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, డీటీఎఫ్ సీఐ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం కల్వకుర్తి, వంగూరు మండలాల్లో ఎక్సైజ్ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. కల్వకుర్తి మండలం తర్నికల్ తండా నుంచి వెంకటాపూర్ గ్రామానికి తెల్లవారుజామున అక్రమంగా 12 లీటర్ల నాటు సారాను తరలిస్తున్న రత్నవత్ రాజును అరెస్ట్ చేసి ద్విచక్ర వాహనాన్ని, నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.అదే విధంగా వంగూరు మండలం దేవునితండా, అన్నారం తండా, రంగాపూర్ గ్రామాల్లో దాడులు చేసి 40 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. అక్రమంగా నాటుసారా విక్రయించిన, తయారు చేసిన చట్టరీత్య చర్యలు ఉంటాయని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది రఘు,మాధవి, పరుశరాం, నార్య, తిరుపతిరెడ్డి ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ బృందం

## ముదిరాజ్ సంఘం కమిటీ భవన నిర్మాణానికి భూమి పూజ



కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఆగష్టు 14 ప్రభాతవార్త:** వెల్దండ ఉమ్మడి మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ భవనానికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కాయితీ ఆశాదీప్‌రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఠాకూర్ బాలాజీసింగ్ రూ.1లక్ష విరాళం, రూ.1.50లక్షల విలువ చేసే సిమెంట్, స్టీల్ తదితర సామాగ్రిని ఆశాదీప్‌రెడ్డి సమీకరించారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరించిన ఠాకూర్ బాలాజీసింగ్, కాయితీ ఆశాదీప రెడ్డిలను ముదిరాజ్ సంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ కమిటీ భవన నిర్మాణానికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవిలతో మరిన్ని నిధులు సమకూర్చి త్వరితగతిన పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సాంబయ్యగౌడ్, భాస్కర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పర్వతాలు, ముదిరాజ్ సంఘం నాయకులు నాయకులు చి.వెంకటయ్య, సత్యం, నారయ్య, అల్లాజీ, జయశంకర్, లక్ష్మయ్య, శ్రీనయ్య, బాల్ లక్ష్మయ్య, నాగేష్, సైదులు, శ్రీనివాస్ ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, మాణిక్యం, బాల్‌చందర్, రాంచందర్ ఉన్నారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేత



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న కాయితీ ఆశాదీప్‌రెడ్డి

**వెల్దండ, ఆగష్టు 14 ప్రభాతవార్త:** వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు కాయితీ ఆశాదీప రెడ్డి తన వంతు సహాయంగా రూ.20వేలను విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ధ్యాపవెంకట్‌రెడ్డి, కాయితీ జయంత్‌రెడ్డి, గంగాపురం యాదగిరి, నక్క మల్లిఖార్జున్, జక్కుల మల్లేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

## నిరుపేద విద్యార్థులకు అండగా శ్రేష్ట ఫౌండేషన్



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఆగష్టు 14 ప్రభాతవార్త:** నిరుపేద విద్యార్థులకు శ్రేష్ట ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని చైర్మన్ శ్యాంపురి రవీందర్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండలంలోని రాచూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శ్రేష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో షూ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఫౌండేషన్ తరుపున తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. అనంతరం పాఠశాల అధ్యాపక బృందం చైర్మన్ శ్యాంపురి రవీందర్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జంగయ్య, గ్రామస్తులు రాధకిషన్‌గౌడ్,తాజుద్దిన్, గోకమల్ల రాజు, గంగాధరి రమేష్, ఉమర్ పాష,వెంకోబా,రాజుబాబు తదితరులు ఉన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగలా నిర్వహించుకోవాలి

### -బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్ రాజశేఖర్ మాయని

**కల్వకుర్తిరూరల్, ఆగష్టు 14 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతి ఒక్కరు ఒక పండుగలా నిర్వహించుకోవాలని బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్ రాజశేఖర్ మాయని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోడీ పిలుపు మేరకు బుధవారం కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలోని ప్రాథమికొన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటిపై నేడు జాతీయ జెండాలను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ 53వ బూత్ అధ్యక్షులు శ్రీను, కల్వకుర్తి శ్రీశైలం, సోషల్ మీడియా కన్వీనర్ మహేష్ తదితరులు ఉన్నారు.



జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగష్టు14 ప్రభాతవార్త:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జ్వరం, డెంగ్యూ వంటి కేసులకు తక్షణ వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం ఆమె మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫీవర్ సర్వే సందర్భంగా నమోదైన జ్వర కేసులు జులైలో నమోదైన జ్వర, డెంగ్యూ తదితర కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఐసియు, మెడికల్ ఓపి తదితర వార్డులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సంపత్ ద్వారా పీవర్, డెంగ్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు, విభాగాల అధిపతులతో ఆసుపత్రికి అవసరమైన మందులు, ఇతర మెడికల్ సామాగ్రి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించే విషయంపై ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది దృష్టి సారించాలని ఆమె అన్నారు. ఆసుపత్రి ఆర్‌ఎంఓ డా. జరీనా ఉన్నారు.

## మహిళా సంఘాలపై విచారణ

**చిన్నంబావి, ఆగష్టు 14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అమ్మాయిపల్లి గ్రామంలో మహిళా సంఘాలలో జరిగిన అవకతవకలపై గతనెల 25న శ్రమలక్ష్మి మహిళా సంఘం సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం డిపిఎం, ఏపిఎం ఆధ్వర్యంలో రికార్డుల తనిఖీ, విచారణ చేపట్టారు. గ్రామంలో చాలాకాలం నుండి శ్రమలక్ష్మి మహిళా సంఘం పేరుపై సంఘం కొనసాగుతుండగా అదే సంఘంలో ముగ్గురు సభ్యులను తీసుకుని మిగతా వారిని తొలగించి కొత్త సంఘం ఏర్పాటు చేసి బ్యాంకు నుండి లోన్ తీసుకున్న సంఘటనపై సంఘంలోని పాత సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వారికి తెలియకుండా రెండవ సంఘం ఏర్పాటు చేసి బ్యాంకులోను పొందడం పై విచారణ చేయాలని ఎపిఎంకి వినతి పత్రం ఇవ్వడంతో డిపిఎం భాషానాయక్, ఎపిఎం మద్దిలేటి, సిసి తిరుపతయ్య, సిసి ఉషమ్మ, అమ్మాయిపల్లి గ్రామాన్ని సందర్శించి మహిళా సంఘాల్లో జరిగిన అవకతవకలపై సంఘ సభ్యులను విచారణ చేశారు. అలాగే ధనలక్ష్మి మహిళా సంఘం సభ్యులు మొలకలపల్లి అక్కలమ్మకు జరిగిన అన్యాయంపై డిపిఎం దృష్టికి తీసుకుపోవడం జరిగింది. ఈ విషయంపై స్పందించిన డిపిఎం తక్షణమే అక్కలమ్మను ధనలక్ష్మి మహిళా సంఘాల్లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎపిఎం మద్దిలేటి, సిసి తిరుపతయ్యకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. గత నాలుగు సంవత్సరాల నుండి ధనలక్ష్మి మహిళా సంఘం సభ్యురాలు అయిన మొలకలపల్లి అక్కలమ్మను సంఘంలో కొనసాగించకుండా సంఘం లీడర్లు, గ్రామ సంఘ లీడర్లు అడ్డుపడుతున్నారని మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారంతటకు వారే లోన్లు, బ్యాంకు రుణాలు తెచ్చుకుంటున్నారని తన సంతకం కూడ అడగడం లేదని డిపిఎంకు తెలిపారు. ఏపిఎం, సిసి గ్రామంలో మహిళా సంఘాల పర్యవేక్షణ చేయకపోవడం వలన ఇలాంటి అక్రమాలకు పాల్పడ్డారని మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మహిళా సంఘాల్లో జరిగిన అక్రమాలపై అధికారులు ఎవరిపై చర్యలు తీసుకోకుండా నిష్క్రమించడంతో గ్రామ మహిళా సంఘం సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.

## జిల్లా కేంద్రంలో పోలీసుల తనిఖీలు

**నారాయణపేట టౌన్,ఆగష్టు 14 ప్రభాతవార్త:** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా బాంబు నిర్వీర్య పోలీస్ బృందం, పోలీస్ జాగిలాలతో బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో, జిల్లా కోర్టు, వివిపి గెస్ట్ హౌస్, జనసామర్థ్యం గల ప్రదేశాలలో బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, సంచులు, వాహనాలు ఏమైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వరద బాధితుల కోసం విరాళాలు

**నారాయణపేట టౌన్,ఆగష్టు 14 ప్రభాతవార్త :** కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలో వరదల్లో సర్వం కోల్పోయిన వారిని ఆదుకోవాలని మనకు తోచిన మేరకు సహకారం అందించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి, విద్యార్థినీ, విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రజలను కోరారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వరద బాధితులకు సహాయం అందజేసేందుకు విరాళాలను సేకరించారు. వరదల వలన వయనాడ్ ప్రజలు ఆస్తులు, అంతస్తులతో పాటు కుటుంబ సభ్యులను,ఆప్తులను కూడా పోగొట్టుకుని పుట్టెడు దు:ఖంలో ఉన్నారని ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న వారికి మానవత్వంతో మనమందరం అండగా ఉండాలని ఆర్థికంగా మనవంతు అండగా నిలవాలని కోరారు.జిల్లా కేంద్రంలో పలు విద్యా సంస్థలను హంసవాణి స్కూల్ విద్యార్థులు, స్ఫూర్తి డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, బాబు జగ్జీవన్‌రామ్ ఒకేషనల్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందంవారికి తోచిన సహాయ సహకారాలుఅందించడం జరిగింది. విరాళాలు సేకరించిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు భానుప్రకాష్, వెంకటేష్, లక్ష్మణ్ ఉన్నారు.

## హాస్పిటల్ ఎదురుగా జూనియర్ డాక్టర్ల నిరసన

**వనపర్తి ఆగష్టు 14 ప్రభాతవార్త :** వనపర్తి గవర్నమెంట్ ఆసుపత్రి ఎదురుగా జూనియర్ వైద్యులు ఆందోళన చేపట్టారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కొద్దిసేపు ఓపీ సేవలను బహిష్కరించారు. వనపర్తి జిల్లా మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం నుంచి ఆసుపత్రి ఎదురుగా నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ...తమను వృత్తి పరంగా కాపాడే రక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కోల్‌కత్తాలో జరిగిన ఘటనలో నిందితుని కఠినంగా శిక్షించాలని ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. లేదంటే దశల వారీ ఉద్యమం చేసామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు, డ్యూటీ డాక్టర్లు, జిల్లా సూపర్డెంట్ అధికారి రంగారావు, ఆర్.ఎం.ఓ శివప్రసాద్, సక్రనాయక్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 19 ఫీట్లకు చేరిన కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం

**దేవరకద్ర,ఆగష్టు 14 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం బుధవారం 19 ఫీట్లకు చేరింది.జూరాల నుండి కృష్ణాజలాలను కోయిల్‌సాగర్‌లోకి తరలింపు కొనసాగుతుంది.అలాగే ప్రాజెక్టునుండి ఆయకట్టుకు కుడి,ఎడమ కాలువల ద్వారా నీటిసరఫరా కూడ కొనసాగుతుంది.కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు.

## రైస్ మిల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన సన్మానం

**కొత్తకోట ఆగష్టు 14 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పాడి గణపతి రెడ్డి ని హైదరాబాద్ వారి ఆఫీసులో వనపర్తి జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విశ్వనాథ వెంకటరమణ, వనపర్తి జిల్లా రైస్ మిల్ సోషల్ గౌరవ సలహాదారులు, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్ , గద్వాల జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి నెల్లురి రామ్మోహన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రైస్ మిల్ వ్యాపార సమస్యలపై పలు విషయాలు చర్చించారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత

**రాజాపూర్,ఆగష్టు 14 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న విద్యార్థుల కోసం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దాదాపు 250 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేసేందుకు ముందుకు వచ్చారు. సింగమ్మగూడ గ్రామ పంచాయతీకి చెందిన యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నారాయణ నాయక్ రాజాపూర్ మండలంలోని సింగమ్మగడ్డ గ్రామ పంచాయతీతో పాటు రంగారెడ్డిగూడ, గుండ్లపొట్లపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న దాదాపు 250 మందికి పైగా విద్యార్థులకు ఈ బ్యాగ్స్‌ను అందజేయనున్నట్లు నారాయణ నాయక్ తెలిపారు. ఆయా పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న కొందరు విద్యార్థులు స్కూల్ బ్యాగ్స్ లేకుండా పాఠశాలకు వెళ్తున్నారని ఈ విషయాన్ని గమనించిన నారాయణ నాయక్ ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి జనుంపల్లి శశికళారెడ్డి సమక్షంలో ఈ బ్యాగ్స్‌ను ఆయా పాఠశాల విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోవిద్యనభ్యసిస్తున్న విద్యార్థుల కోసంముున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలను చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా నారాయణ నాయక్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పియులో తెలుగు సాహిత్యంపై విస్తృతోపన్యాసం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగష్టు 14 ప్రభాతవార్త :** పాల మూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఉస్మానియా విశ్వ విద్యాలయం పూర్వాధ్యక్షులు ప్రస్తుత పాలమూరు విశ్వ విద్యా లయం తెలుగు శాఖ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు ప్రొ॥ సూర్యధనుంజయ్ తెలుగు సాహిత్యంపై ఎంఏ తెలుగు విద్యా ర్థులు, తెలుగు పరిశోధక విద్యార్థులు తెలుగు అవగాహనకు ఎక్స్టెన్షన్ లెక్చరర్ విస్తృతమైప ఉపన్యాసాన్ని ఇచ్చారు. సాహిత్యంలో వస్తున్న పరిణామాలు, ధోరణులు వివిధ రకాలైన అస్తిత్వ వాదాలు అందులో నేటిసమాజ పోకడలను వర్ణించారు. తాను స్వయంగా రచించిన కొంగు బంగారం అనే గ్రంథాన్ని విద్యార్థులకు పంపిణీ చేశారు. జీవితంలో ఏదో ఒక ఆశయంతో పని చేయాలని అలా చేయడం వల్ల మనం అనుకున్న లక్ష్యా లను సాధించగలుగుతామని దిశ నిర్దేశం చేశారు. విశ్వ విద్యాల యంలో డా. సూర్య ధనుంజయ మేడంని అందరు అమ్మ అని సంబోధించడం విశేషం. పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు డా. సంధ్యారాణి, పూర్వాధ్యక్షులు డా.మన్నె మోని కృష్ణయ్య, డా.బి.రవిందర్‌గౌడ్, ఆమె ఆదర్శ జీవన విధానాన్ని సాహిత్యంలో వారి కృషిని కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ పిజి సెంటర్ ప్రిన్సిపల్ తెలుగు శాఖ అధ్యక్షులు డా. మార్క్ పొలోనియస్, గద్వాల పిజి సెంటర్ ప్రిన్సిపల్, తెలుగుశాఖ అధ్యక్షులు డా. చెవ్వ వెంక ట్‌రెడ్డి, పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు డా. జై తిరుపతయ్య, పాలమూరు విశ్వవిద్యాలయం పిఆర్ఓ డా. రవికుమార్ పాల్గొన్నారు.

# పదేళ్లలో రూపాయి పెట్టుబడి రాలే

- బిఆర్ఎస్ సర్కారు ప్రగతి భవన్‌లో గడీలకు పరిమితమైంది
- హైదరాబాద్‌కు ప్రపంచంలో పోటీపడే సత్తా ఉన్న నిర్వీర్యం చేశారు
- ఎనిమిది నెలల పాలనలో క్రమశిక్షణతో అభివృద్ధి
- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 31 వేల కోట్ల పెట్టుబడులు సాధించాం
- మీడియా సమావేశంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగష్టు 14 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ సర్కారు ప్రగతి భవన్‌లో గడీలకు పరిమితమైందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమెరికా పర్యటన జీవితంలో ఎంతో సంతృప్తిని, సంతోషం నింపిందని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రముఖ కంపెనీలతో 31 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడం జరిగిందని, ఇంకా కొన్ని కంపెనీలతో చర్చలు జరపాలని ఆయన తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత, పది సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్రం చాలా కోల్పోయిందని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే ఇప్పుడు తెలంగాణ రాష్ట్రానికిభారీ పెట్టుబడులు వచ్చాయని, సిఎం, ఐటిశాఖ మంత్రి, అధికారుల బృందం పారిశ్రామిక వేత్తలకు విశ్వాసం, నమ్మకం కల్పించే విధంగా రిప్రెజంటేషన్ చేసుకుంటూ, వారిని ఒప్పించి తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ప్రోత్సహించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. డల్లాస్‌లో జరిగిన 2400 ఐటి కంపెనీల సంఘం ప్రతినిధుల సమావేశంలో ఎన్నో ప్రతిష్టాత్మక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహం చూపించాయని ఆయన చెప్పారు. గతంలో ఏం జరిగింది? ఇప్పుడు ఏం జరుగుతుందో ప్రజలకు అర్థం అవుతుందని ఆయనఅన్నారు.1500 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలో పెట్టుబడులను పెట్టాలని ముఖ్యమంత్రి స్వయంగా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. దాంతో 31వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి సంతకాలు, ఒప్పందాలు చేసుకోవడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 40వేల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులు రాష్ట్రానికి తెచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. లక్షలాది మంది తెలంగాణ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు భారీగా లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంతో పోటీ పడి శక్తి మన తెలంగాణాకు ఉన్న,గత పది సంవత్సరాలు కాలాన్ని వృధా చేసుకున్నామని ఆయన ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పదుల సంఖ్యలలో విదేశాల పర్యటన చేసి ఒక కొత్త కంపెనీ కూడా ఒక కొత్త పరిశ్రమ సైతం రాష్ట్రానికి తేలేదని, ఒక రూపాయి పెట్టుబడిని కూడా కెటిఆర్ తెలంగాణ రాష్ట్రానికి తేలేదని తన సొంత పనులు చక్కబెట్టుకునేందుకు ఆయన విదేశాలకు పోయారని ఆయన ఆరోపించారు. మూసీ నదిని సుందరీకరణ చేసేందుకు విదేశాల్లో ఉన్న కొన్ని నదులను ముఖ్యమంత్రి పరిశీలించడం జరిగిందని ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్‌కు 1500 ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్, ఇంజనీరింగ్ తదితర స్కిల్‌లో నైపుణ్యాలను పెంచుకుంటే రాబోయే కొన్ని సంవత్సరాల్లో అద్భుతంగా మహబూబ్‌నగర్ అభివృద్ధి చెందుతుందని మన ముఖ్యమంత్రికి ఒక విజన్ ఉందని ఎలాంటి భేషజాలకు తావివ్వకుండా ఆయన అందరిని కాలుపుకుని ముందుకు సాగుతున్నారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్, స్లమ్ ఏరియా డెవలప్‌మెంట్, కాలుష్యంపై ప్రపంచ బ్యాంక్ కూడా అనుకూలంగా ఉందని అందుకు 400 కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు ప్రపంచ బ్యాంకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. లోపాలు ఎత్తిచూపే ప్రయత్న చేయడం తప్ప వారు గత పది సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా పెట్టుబడి రాష్ట్రానికి తేలేదని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో కాగ్నిజెంట్ కంపెనీ 1500 ఉద్యోగాల కల్పన చేస్తూ ఈ రోజు శంకుస్థాపన చేసుకుంటుందని ఆయన గుర్తు చేశారు. రీజనల్ రింగ్ రోడ్డు గురించి పార్లమెంటులో నితిన్ గడ్కరీ ప్రకటించడం జరిగిందని, స్థల సేకరణ రెండు, మూడు నెలల్లో పూర్తి చేస్తామని,రాబోయే నాలుగున్నర సంవత్సరాల్లో అద్భుతమైన పరిపాలన, అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇండస్ట్రీ ఫ్రెండ్లీ ప్రభుత్వమని ఏ సమస్యలు ఉన్నా తప్పక పరిష్కరిస్తామని అందరికి ఆమోద యోగ్యమైన ఇండ్రస్టీలకు రాయితీలను ఇచ్చి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలోటిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, మల్లు నరసింహారెడ్డి, లక్ష్మణ్ యాదవ్, ఫయాజ్, సిజె బెనహర్, ఫయీమ్ పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులు మనందరిపై ఉండాలి

● మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగష్టు 14 ప్రభాతవార్త:** అమ్మవారి ఆశీస్సులు, అమ్మవారి చల్లని చూపు మనందరిపై ఉండాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేటలో మహెందర సంఘం (మేదర సంఘం) ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ మల్లేశ్వరి మాత (మల్లెలమ్మ) నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని,అమ్మవారి ఆశీస్సులు మనందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ దేవాలయం అభివృద్ధికి సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కౌన్సిలర్ అంజయ్య, వినోద్‌కుమార్, లక్ష్మణ్ యాదవ్, లీడర్ రఘు, సత్యం, కెఎం.వెంకటేష్, టింకు పాల్గొన్నారు.

### మల్లేశ్వరదేవి ఆశీస్సులు అందరిపై ఉండాలి : ఎంపి అరుణమ్మ



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎంపి డికె అరుణ

మల్లీశ్వరిదేవి (మల్లెలమ్మ) ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణమ్మ ఆకాంక్షించారు. బుధవారం మహబూబ్ నగర్ వీరన్నపేటలో మేదరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అరుణమ్మ మాట్లాడుతూ ఆ మల్లెలమమ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకుని దైవకృపకు పాత్రులు కావాలని సూచించారు.

# బిసి కులగణన చేశాకే ఎన్నికల్లోకి వెళ్లాలి

### సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకొండ ప్రణీల్ చందర్



మాట్లాడుతున్న ప్రణీల్ చందర్

**జడ్చర్ల,ఆగష్టు 14 ప్రభాతవార్త:** బిసి కుల గణన చేపట్టిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ డిమాండ్ చేశారు. జడ్చర్ల మండల కేంద్రంలోని సిగ్నల్‌గడ్డ వద్ద మా వాటా మాకే పుస్తకావిష్కరణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 12769 గ్రామ పంచాయతీలున్నాయని సగానికి పైగా జనాభా ఉన్న బిసిల చేతుల్లోకి 6 వేలకు పైగా గ్రామ రాజ్యాలు రావాలని, ఇది జరిగి తీరాలని డిమాండ్ చేశారు. బిసిలకు వాగ్దానం ఇచ్చిన పార్టీ అధికారంలో ఉంది గనుక బిసి కులగణన జరిపిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని కోరారు. బిసి వర్గాలకు దక్కాల్సిన రిజర్వేషన్లు అమలు చేస్తే ప్రతి నియోజకవర్గంలో సగం పంచాయతీల్లోకి బిసిల నాయకత్వం వస్తుందని, జడ్పీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, డిసిసిబి చైర్మన్లు, మండలాధ్యక్షులు, జడ్పీటిసి, ఎంపిటిసిల్లో సగానికి పైగా బిసి వర్గాలు పొందుతాయని, ఈ పని జరగాలంటే బిసి కులగణన చేయాలి. బిసిలు అత్యంత వెనుకబడిన బిసిలు, సంచార, అర్ధ సంచార జాతుల జనాభా లెక్క ప్రకారం స్థానిక సంస్థల్లో అందరికి సమ ప్రాధాన్యం లభించాలని పేర్కొన్నారు.ఇది తెలంగాణ పునర్నిర్మాణంలో అత్యంత కీలకమైనది. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం నినాదంతో ఎగిసిన మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలు ఇచ్చింది బిసిలే, ఊపిరిలు తీసుకున్న అత్యధికులు బిసిలేనని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం వచ్చింది స్వీయ రాష్ట్ర పాలన అమలులోకి వచ్చింది కానీ తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం పాలించే అధికారం అతి తక్కువ జనాభా కలిగిన అగ్రకులాలకే వచ్చిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం కాదు. మెజార్టీ జనులుగా ఉన్న సగభాగం జనాభా కలిగిన బిసిలు, 28 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీలు 12 శాతంగా ఉన్న మైనార్టీలు అధికారాన్ని పొందగలిగినప్పుడే అది తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం అవుతుందన్నారు. అందుకోసం తెలంగాణలో మరో పోరాటం జరగాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో బిసి సంఘం జిల్లా నాయకులు నర్సింహులు, బిజెపి నాయకులు బాలవర్ధన్‌గౌడ్, బిసి సేన రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ యాదవ్, బిసి జిల్లా నాయకుడు నడిమింటి శ్రీనివాస్, బాలయ్య ముదిరాజ్, కౌన్సిలర్ లత, బిఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ వీరేష్, సుప్ప ప్రకాష్, మాజీ సర్పంచ్‌లు రేణుక, బాదేపల్లి యాదయ్య యాదవ్, చెన్నారెడ్డిపల్లి, శ్రీనుయాదవ్, వల్లూరు గోపాల్‌గౌడ్, నవాబ్‌పేట కొండల్, నరసింహ యాదవ్ ఇతర బిసి నాయకులు పాల్గొన్నారు.

# పేటలో పిఓడబ్ల్యు పిడిఎస్‌యు నాయకుల నిరసన



నిరసన చేపట్టిన పిడిఎస్‌యు నాయకులు

**నారాయణపేట టౌన్,ఆగష్టు 14 ప్రభాతవార్త:** వైద్య కళాశాల విద్యార్థినిని హత్య చేసిన దుండగున్ని కఠినంగా శిక్షించాలని (పిఓడబ్ల్యు) రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. కలకత్తా రాష్ట్రంలో వైద్య విద్యార్థినీ హత్యను నిరసిస్తూ బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి (పిఓడబ్ల్యు) జిల్లా కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ కలకత్తాలోని ఆర్జీకార్ ప్రభుత్వ వైద్య కళాశాలలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగున్ని కఠినంగా శిక్షించాలన్నారు. అమ్మాయిపై అత్యాచారం జరిగిన హత్య చేసిన కళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో వ్యవహరించడం సరైన పద్ధతి కాదు. సెమినార్ హాల్‌లో జూనియర్ వైద్యురాలిపై అత్యంత పాశవీకంగా దాడి చేస్తుంటే ఆసుపత్రిలో ఉన్న వారికి తెలియకపోవడం యాజమాన్యం ఆలస్యంగా స్పందించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్న పరిస్థితి ఉన్నదన్నారు. వైద్యురాలి మృతదేహం రోడ్డు పక్కన ఏమి దొరకలేదని, ఆసుపత్రి సూపరింటెండెంట్ లేదా వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎందుకు స్పందించలేదన్నారు. ఎందుకు నిర్లక్ష్యం వహించారనే విషయం అనేక అనుమానాలకు దారి తీస్తున్న పరిస్థితి. ఈ సంఘట నపై దేశవ్యాప్తంగా వైద్యులు నిరసన తెలుపుతున్న పరిస్థితి ఉన్నప్పటికిని కేంద్ర వైదారోగ్యశాఖ మంత్రి కూడా సకాలంలో స్పందించకుండా, లేటుగా స్పందించడం అంటే దీనికి నిదర్శనం అన్నారు. ఈ దేశంలో ఆడపిల్లల పట్ల వీళ్లకున్న చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. రోజుకు ఒకపక్క దేశంలో ఆడపిల్లలపై చిన్నపిల్లల నుంచి పండు ముసలి వరకు అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా ప్రభుత్వాలు, అధికారులు ఎందుకు స్పందించరన్నారు. ఆడపిల్లల రక్షణకై అతి కఠినమైన చట్టాలను ఎందుకు తీసుకురాదని అన్నారు. ఆ అమ్మాయి కుటుంబానికి న్యాయం చేయాలని 10 కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా నాయకులు సునిత, సత్యమ్మ, భారతమ్మ, కళావతి, హరిత, పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, గౌస్, నాయకులు నవీన, అరుణ, లావణ్య, లక్ష్మి, అనూష, నవిత, రాజు, ప్రశాంత్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## గొంతు నులిమి బాలుడి హత్య

(మొదటి పేజీ తరువాయి)

గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితుని రిమాండ్ కు తరలించనున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు బాలుడు కనిపించకపోవడం కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న ఇటిక్యాల పోలీసులు అనుమానితుల్ని అదుపులోకి తీసుకొని విచారించగా బాలుడును హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకోవడంతో ఈ కేసును 12 గంటల్లోగా పోలీసులు చేధించారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**లింగాల, ఆగష్టు 14 ప్రభాతవార్త:** సీజనల్ వ్యాధులతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి శివశంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెన్నంపల్లి, అప్పాయిపల్లి, పద్మానపల్లి, లింగాల గ్రామాల్లో లింగాల ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు తగిన మందులు పంపిణీ చేశారు. పద్మనపల్లి గ్రామంలో మాత్రం 30 మందికి రక్త పరీక్ష, డెంగ్యూ, మలేరియా, బిపి, సిబిపి తదితర శాంపుల్‌ను నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు. అనంతరం వైద్యాధికారి శివశంకర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని కోరారు. కార్యక్రమంలో యాదబాయి, రాజీబాయి, రేణుక, సంధ్య, జ్యోతి, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ

**అడ్డాకుల, ఆగష్టు14 ప్రభాతవార్త:** బంగ్లాదేశ్‌లో హిందువులపై, దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బుధవారం అడ్డాకుల మండల కేంద్రలో హిందూ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు హిందూ వాహిని ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది.ఈ సందర్భంగా వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. యువకులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల తహసిల్దార్‌కు మదన్‌మోహన్‌గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. హిందువులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు దేవాలయాలపై పాశవికంగా చేస్తున్న దాడులను భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో హిందూవాహిని గ్రామ యువకులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దండు క్రాస్ వద్ద రెండు బైకులు ఢీ

### ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు

**మక్తల్ టౌన్, ఆగష్టు 14 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణం దండుక్రాస్ వద్ద వరుస ప్రమాదాలకు అడ్డాగా మారింది. ఒకే నెలలో మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే మక్తల్ పట్టణం నుండి ముగ్గురు వ్యక్తులు జక్లేర్‌కు మోటార్ వెహికల్‌పై వెళ్తుండగా ఎదురుగా కొల్లూరు గ్రామానికి చెందిన భార్యాభర్తలున్న బైక్‌ను ఢీకొని యువకులు తీవ్ర ప్రమాదానికి గురయ్యారు.తీవ్ర గాయాలైన వారిలో యాదగిరి, వెంకటేష్, ఆంజనేయులు గాయాలకు గురై తీవ్ర గాయాలైన వ్యక్తులను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

## జడ్చర్ల గురుకులంలో విజిలెన్స్ తనిఖీలు

**జడ్చర్ల, ఆగస్టు14, ప్రభాతవార్త:** జడ్చర్లలోని మైనార్టీ గురుకులంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం నాగసాల,కావేరమ్మపేట వద్ద ఉన్న బాలుర.బాలికల గురుకులాల్లో విజిలెన్స్ డీఎస్పీ రాజశేఖర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు అందించే భోజనం, మెనూ, గురుకులాల్లో సౌకర్యాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రతతోపాటు విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. ఇటీవలే నాగసాల మైనార్టీ గురుకులంలో 9మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈక్రమంలో విజిలెన్స్ అధికారులు చర్చనీయాంశంగా మారాయి. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై రాచంద్రయ్య పాల్గొన్నారు.

## 78వ స్వాతంత్ర వేడుకలకు ముస్తాబైన కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు





గద్వాల జిల్లా కలెక్టర్,ఎస్పీ కార్యాలయాలను విద్యుత్ లైట్లతో అలంకరణ చేసిన అధికారులు

**గద్వాల, ఆగష్టు14 ప్రభాతవార్త:** 78వ స్వాతంత్ర వేడుకలకు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలను సుందరీకరించారు.విద్యుత్ లైట్లతోసర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. మూడు రంగుల బల్బులతో అందంగా చేశారు.









## స్వాతంత్ర వెలుగులు..

78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకులకు పాలమూరు ముస్తాబైంది. జిల్లా కేంద్రంలోపాటు ఆయా మండలాల్లో ప్రభుత్వం కార్యాలయాలు వెలుగులు,జిలుగులతో జిగేల్‌మంటున్నాయి. మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంతోపాటు ఇతర జిల్లా కార్యాలయాలు, తాసిల్దార్ కార్యాలయం రంగురంగుల వెలుగులు లైట్లతో ఆకర్షింపజేస్తున్నాయి. అదేవిధంగా చౌరాస్తాల్లో మహనీయుల విగ్రహాల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయడంతో జిగేల్‌జిగేల్‌మంటున్నాయి.

- మహబూబ్‌నగర్ ఫొటోగ్రాఫర్